న్యూస్‌రీల్

ఇంటిలో ఇలాగే తింటారా..?



బైదలాపురంలో కూరను పరిశీలిస్తున్న ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు

పాతపట్నం: విద్యార్థులకు పెట్టే భోజనం రుచిగా ఉండాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సీతంపేట ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు అన్నారు. మండలంలోని బైదలాపురం ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఏపీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం వంటశాలలోని కూరను పరిశీలించి, నాణ్యత లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటిలో ఇలాగే తింటారా అని నిలదీశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి: ఎస్పీ



పోలీసుల వ్యక్తిగత ప్రదర్శన, డాగ్‌స్క్వాడ్‌లు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీస్ సిబ్బంది వ్యక్తిగత క్రమశిక్షణతో పనిచేస్తూ ముందుకు సాగాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో శుక్రవారం పోలీస్ పరేడ్, డాగ్ స్క్వాడ్ ప్రదర్శన నిర్వహించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఆయన అనంతరం వ్యక్తిగత నైపుణ్యాలు పరిశీలించారు. దేహ దారుఢ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం గ్రీవెన్స్ నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. వృత్తిపరమైన, వ్యక్తిగత సమస్యలు తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.శేషాద్రి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు పాల్గొన్నారు.

రైల్వే కార్మిక సంఘ ఎన్నికలకు శంఖారావం

కాశీబుగ్గ: రైల్వే కార్మిక సంఘం ఎన్నికలకు సిద్ధం కావాలని ఈస్ట్‌కోస్టు కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహు అన్నారు. పలాస రైల్వే స్టేషన్ ఆవరణంలో ఉన్న ఆ సంఘ కార్యాలయంలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్నికల డిమాండ్‌లలో భాగంగా 2004 అనంతరం రిక్రూట్ అయినవారికి ఓపీఎస్ వర్తింపచేయాలని, 8వ వేతన సంఘం వెంటనే అమలు చేయాలని, కార్మికుల జీతభత్యాలు పెంచాలని కోరారు. పలాస రైల్వే కాలనీని ఆధునీకరించాలని, రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు కల్పించాలని, రన్నింగ్ స్టాఫ్‌ను పెంచాలని కోరారు.

హాస్టళ్ల పరిశీలన



బావిని పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ ఆదేశానుసారం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు ఆకస్మికంగా బీసీ, ఎస్టీ హాస్టల్స్‌ని శుక్రవారం సందర్శించారు. శ్రీకాకుళం నగరంలో గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల, గవర్నమెంట్ బీసీ బాయ్స్ హాస్టల్, సింగుపురం హాస్టల్స్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలల పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. అనంతరం వారికి చట్టాలపై అవగాహన కల్పిస్తూ తగు పరిష్కార మార్గాలను వివరించారు.

ఉచిత డీఎస్సీ శిక్షణ దరఖాస్తు గడువు పొడిగింపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా నిరుపేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలతో డీఎస్సీ శిక్షణ ఇస్తోంది. డీఎస్సీ శిక్షణ ఇవ్వడానికి ప్రైవేటు శిక్షణ సంస్థల యజమానులు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 25 నుంచి 27కు పెంచామని సంబంధిత వర్గాలు తెలిపాయి. దరఖాస్తు చేసుకునేందుకు జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లో సేవలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

యంత్రాలతో కుతంత్రం



సీఎం తాలూకాగా తొలుత చెప్పుకుని, ఆ తర్వాత డీసిల్టేషన్ పాయింట్‌గా నడుపుతున్న బూర్జ మండలం కాఖండ్యాం ఇసుక ర్యాంపు ఇది. ఈ ఫొటో చూస్తే ఇసుక మాఫియా నదులను ఏ స్థాయిలో ధ్వంసం చేస్తుందో అర్థం చేసుకోవచ్చు. నాగావళి నది మధ్యలో నేరుగా జేసీబీలు, పొక్లెయినర్లు పెట్టి ఇసుక తవ్వేస్తున్నారు. అంతటితో ఆగకుండా నదిలోకి భారీ లారీలను తీసుకొచ్చి లోడింగ్ చేసి విశాఖ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

- నాగావళి నదిలో బరితెగింపు
- తొలుత సీఎం తాలూకా పేరుతో.. తర్వాత డీసిల్టేషన్ పాయింట్ ముసుగులో అక్రమాలు
- కా ఖండ్యాంలో అమరావతి పెద్దల డైరెక్షన్‌లో ఇసుక దోపిడీ
- సుప్రీంకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు విరుద్ధంగా తవ్వకాలు
- నది మధ్యలో జేసీబీ, పొక్లెయినర్లతో తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



నాగావళి నదిలో లారీల జాతర ఇది. ఏకంగా నదిలోకే లారీలు క్యూ కట్టేస్తున్నాయి. తవ్వకాలు జరిగిన ప్రాంతానికే వెళ్లి ఇసుక లోడింగ్ చేస్తున్నాయి. బరితెగింపు అని చెప్పడానికి ఇంతకంటే సాక్ష్యాలు అవసరం లేదు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

బూర్జ మండలం కాఖండ్యాం ఇసుక ర్యాంపు అక్రమాలకు అడ్డాగా మారింది. సీఎం తాలూకా అని మొదట ఇసుకను దోచేశారు. తర్వాత డీసిల్టేషన్ పాయింట్ పేరుతో అమరావతి పెద్దలు ఇసుక మింగేస్తున్నారు. మొత్తానికి ఈ ఒక్క ర్యాంపులోనే కూటమి ప్రభుత్వం వచ్చాక రూ. 40కోట్లకు పైగా ఇసుక తరలిపోయిందన్న వాదనలు ఉన్నాయి. ఇక్కడ తవ్వకాలకు, తరలింపునకు సరైన లెక్కా పత్రం లేదు. ఎందుకంటే ఇది పెద్దల ర్యాంపు. పేరుకే డీసిల్టేషన్ పాయింట్. జరిగివన్నీ అడ్డగోలు లావాదేవీలే. అమరావతి పెద్దలు చెప్పినట్టుగా ఇసుక తవ్వకాలు జరిగిపోతున్నాయి.

ఇరిగేషన్, మైనింగ్, రెవె న్యూ సిబ్బంది డమ్మీగా మిగిలిపోయారు. అభ్యంతరాలు చెప్పలేని పరిస్థితిలో చోద్యం చూస్తున్నారు. ఎంత తవ్వారో, ఎంత తరలించారో కచ్చితమైన లెక్కల్లేవు. నామ్ కే వాస్తే పర్యవేక్షణ తప్ప వాస్తవ లావాదేవీలు రికార్డులకు ఎక్కడం లేదు.

సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా..

నదిలో ఉన్న ఇసుక మేటలను తొలగించి నదీ గమనాన్ని సరిచేయడం డీసిల్టేషన్ పాయింట్ ఉద్దేశం. కానీ ఇక్కడ డీసిల్టేషన్ పాయింట్ అర్థం మారిపోయింది. తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత.. దోచుకున్నోడికి దోచుకున్నంత అన్నట్టుగా మారిపోయింది. డీసిల్టేషన్ పేరుతో ఇసుక దోపిడీ జరుగుతోంది. ఇసుక తవ్వకాలకు సుప్రీంకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. నదిలో ఇసుకను మాన్యువల్‌గా తవ్వి, నదీ పరివాహక ప్రాంతం పక్కన స్టాక్ చేసి, అక్కడి నుంచి వాహనాలతో ఇసుక తరలించాలి. తవ్వకాలకు ఎలాంటి యంత్రాలు ఉపయోగించకూడదు. నదీలోకి భారీ వాహనాలను అనుమతించకూడదు. కానీ, అందుకు భిన్నంగానే జరుగుతోంది. జేసీబీలు, పొక్లెయినర్లు పెట్టి నది మధ్యలో తవ్వకాలు జరిపేస్తున్నారు. అక్కడికే వందలాది లారీలను అనుమతించి ఇసుక లోడింగ్ చేస్తున్నారు. ఒక్కో లారీకి వేలల్లో వసూలు చేస్తున్నారు. వాస్తవంగా చలానాలు తీసిన లారీలకు మాత్రమే ఇసుక ఇవ్వాలి. అవి కూడా స్టాక్ పాయింట్ నుంచి తీసుకెళ్లాలి. కానీ, చలానాలు తీసుకోని లారీలు సైతం తవ్వకాలు జరిపిన ప్రాంతానికే వచ్చేస్తున్నాయి. ఇదంతా లెఫ్ట్ బిజినెస్. ఈ డబ్బు అంతా అమరావతి పెద్దలకు, స్థానిక కీలక నేతల జేబుల్లోకి వెళ్లిపోతోంది. అడ్డగోలుగా జరుగుతున్న తవ్వకాలతో భవిష్యత్‌లో నాగావళి ద్వారా పరివాహక ప్రాంతాలకు ముప్పు ఉంటుంది. నదీ గమనం మారిపోవడంతో వరద ప్రమాదం ఉండనుంది. గ్రామాల్లోకి వరద నీరు వచ్చేసి విజయవాడ బుడమేరు లాంటి ఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉంది.

భారీగా ముడుపులు..

బూర్జ మండలం కాఖండ్యాం ఇసుక డీసిల్టేషన్ పాయింట్‌తో అమరావతి, స్థానిక కీలక నేతలకే



కాదు అధికారులకు సైతం కాసులు కురిపిస్తోంది. ఎవరికి అందాల్సిన ముడుపులు వారికి అందడంతో అడ్డగోలుగా జరుగుతున్న ఇసుక తవ్వకాలు, తరలింపుపై చర్యలు తీసుకోవడం లేదు. కళ్లముందు జరుగుతున్న అక్రమాలపై చోద్యం చూస్తున్నారు. ఉన్నత స్థాయిలో కూడా ముడుపులు అందుకోవడంతో పై నుంచి కూడా ఒత్తిళ్లు లేవు. దీంతో అంతా కలిసి కుమ్మక్కై నాగావళి నదిని దోచేస్తున్నారు. డీసిల్టేషన్ పాయింట్ పేరుతో దర్జాగా ఇసుక దోపిడీ చేస్తున్నారు. చివరికి చెక్‌పోస్టు తనిఖీలకు తిలోదకాలిచ్చేశారు. అక్రమాలకు బార్లా తెరిచారు. నదిలోకి వెళ్లండి తవ్వుకున్నంత తీసుకోండని అక్రమార్కులకు వదిలేశారు.

కోర్టులపైనే ఆశలు..



ఇప్పుడున్న పరిస్థితి చూస్తుంటే కోర్టులు, గ్రీన్ ట్రిబ్యునల్ తప్ప స్పందిస్తే తప్ప ఇసుక అక్రమాలను అడ్డుకునే పరిస్థితి కనిపించడం లేదు. ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారు. అవసరమైతే చంపుతామని ఇసుక మాఫియా బెదిరింపులకు, దాడులకు దిగుతోంది. జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే కోర్టులు తప్ప మరేవీ ఇక్కడ అక్రమాలకు అడ్డుకట్ట వేసే పరిస్థితి లేదు. ఆ దృష్టితో కొందరు కోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నారు. నాగావళి నదిని కోర్టులే కాపాడాలని కోరనున్నారు.

ఆయువు తీరినా ఆపద్బాంధవుడే

- అవయవాలు దానం చేసిన జగదీష్
- బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారణ
- జెమ్స్‌లో అవయవదానం





గ్రీన్ చానెల్ ద్వారా అవయవాలను తరలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్:

ఆయువు తీరిపోయినా ఆయన ఆపద్బాంధవుడిగా నిలిచారు. తాను చీకటిలో కలిసిపోతూ మరో నలుగురి బతుకుల్లో వెలుగులు నింపారు. తాను మృత్యువుకు చేరువైనా మరికొందరి ఆయుష్షు రేఖను మాత్రం పెంచగలిగారు. సోంపేట మండలం జింకిభద్ర గ్రామానికి చెందిన గరుగు జగదీష్(40) అనే వ్యక్తి బ్రెయిన్ డెడ్‌కు గురికావడంతో ఆయన అవయవాలు దానం చేశారు. శ్రీకాకుళం సమీపంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఈ క్రతువుకు వేదికైంది. ఈ ఆస్పత్రిలో అవయవదానం జరగడం ఇది 19వ సారి కావడం విశేషం.

జింకిభద్రకు చెందిన జగదీష్ ఈ నెల 20న ప్రమాదవశాత్తు కిందపడిపోయారు. సాధారణంగానే పడిపోయారని కుటుంబ సభ్యులు అనుకున్నారు. కానీ రెండు రోజుల తర్వాత స్థానిక వైద్యులకు చూపిస్తే తలలో రక్తస్రావం జరిగినట్లు తెలిసింది. దీంతో ఈ నెల 22న రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే ఆయన పరిస్థితి విషమంగా ఉంది. 24న ఆయన అపస్మారక స్థితికి వెళ్లిపోయారు. జగదీష్ బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యారని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే అవయవదానంపై అవగాహన కల్పించారు. అంత బాధలోనూ కుటుంబ సభ్యులు సహృదయంతో అవయవాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు వచ్చి ప్రక్రియ సజావుగా జరిగేందుకు సహకరించారు.

జగదీష్‌కు ఘన నివాళి..

అవయవదాన ప్రక్రియ ముగిశాక జగదీష్ పార్థివ దేహానికి ఆస్పత్రికి సిబ్బంది, వైద్య విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌తో పాటు ప్రభుత్వం అందజేసిన రూ.10వేలు నగదును జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, జెమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ హేమంత్ చేతులు మీదుగా అందజేశారు. జగదీష్‌కు భార్య, పాప, బాబు ఉన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అంబేద్కర్, జనరల్ మేనేజర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ బాలమురళీ, కిరణ్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నా కొడుకు ప్రాణాలు నిలబడ్డాయి



మాది ఆమదాలవలస మండలం, తురకపేట గ్రామం. నా భర్త ఆర్మీలో పనిచేస్తూ చనిపోయారు. నాకు ఇద్దరు పిల్లలు. మా పెదబాబు బాలాజీకి కిడ్నీ సమస్య ఉంది. దీంతో నేను విజయవాడలోని జీవన్ దాన్‌కు కిడ్నీ కావాలంటూ ఈ ఏడాది జనవరిలో దరఖాస్తు చేసుకున్నాను. శుక్రవారం ఆస్పత్రిలో జగదీష్ బ్రెయిన్ డెడ్‌కు గురి కావడంతో ఆయన కిడ్నీనే నా కుమారుడికి అందించారు. జెమ్స్, ఆస్పత్రి జగదీష్ నా కుమారుడికి ప్రాణభిక్ష పెట్టారు. అన్ని వసతులు దగ్గరుండి చూసుకున్నారు.

– మీనాక్షి, కిడ్నీ అమర్చిన బాలుడి తల్లి

గ్రీన్ చానెల్ ఏర్పాటు..

జెమ్స్‌లో అవయవదానంపై సమాచారం అందుకున్న ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద పర్యవేక్షణలో గ్రీన్‌చానెల్ ఏర్పాటు చేశారు. స్థానిక కొత్తరోడ్ నుంచి జెమ్స్ ఆస్పత్రి వరకూ గ్రీన్ చానెల్‌లో జగదీష్ అవయవాలను విశాఖకు తరలించారు.

- ఒక కిడ్నీని విశాఖపట్నంలోని అపోలో ఆస్పత్రికి అందించారు.
- మరొక కిడ్నీని ఇదే ఆస్పత్రిలో మరొకరికి అమర్చారు.
- ఊపిరితిత్తులను సికింద్రాబాద్‌లోని కిమ్స్‌కు అందించారు.




మృతదేహం వద్ద కుటుంబ సభ్యులకు నగదు, సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

ఊపిరి పీల్చుకున్న ఉద్దానం

- తప్పిన దానా ముప్పు
- సముద్రంలోకి వేటకెళ్లిన మత్స్యకారులు

వజ్రపుకొత్తూరు రూరల్: దానా తుఫాన్‌పై ఆందోళన చెందిన ఉద్దానం ఊపిరి పీల్చుకుంది. వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉండి ఆశాజనకంగా కనిపిస్తోంది. ఈ తరుణంలో వాతావరణ శాఖాధికారుల హెచ్చరికలు గత వారం రోజులుగా రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. శుక్రవారం తుఫాన్ తీరం దాటి పెను ముప్పు తప్పడంతో రైతు ఆశలు చిగురించాయి. అలాగే తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న మత్స్యకారులు సైతం అధికారుల హెచ్చరికలతో అప్రమత్తం అయ్యారు. ఏ సమయంతో ఏం జరుగుతుందోనని భయాందోళన చెందారు. అయితే ఎలాంటి ముప్పు లేకపోవడంతో మత్స్యకారులు కొంత మంది యథావిధిగా శుక్రవారం సముద్రంలో చేపల వేట సాగించారు. అయితే గత 5 రోజులుగా చేపల వేట సాగక జీవనం కష్టంగా మారడంతో చేపల వేటకు వెళ్లామని, వేట సాగించిన తమకు కొద్ది పాటి మత్స్య సంపద దొరికిందని ఆనందం వ్యక్తం చేసారు.



అక్కుపల్లి తీరంలో ప్రశాంతంగా ఉన్న సముద్రం

జనవరిలో తల్లికి వందనం

- మంత్రి అచ్చెన్నాయుడు
- జిల్లాలో పశు గణన ప్రారంభం

కోటబొమ్మాళి: పాడి రైతుల అభివృద్ధి కోసమే పశు గణన చేపడుతున్నామని పశుసంవర్థకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి మండలం పెద్దబమ్మిడి గ్రామంలో ఆయన పశు గణన సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. అక్టోబర్ 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు 17,244 గ్రామాలు, 3,929 మున్సిపల్ వార్డుల్లో ఈ గణన జరుగుతుందన్నారు. ఈ సర్వేకు గాను 5,390 మంది సిబ్బందిని నియమించామని, 1237 మంది సర్వేను పర్యవేక్షణ చేయనున్నారని, 45 మంది స్క్రూటినీ చేస్తారని పేర్కొన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్, జనవరిలో తల్లికి వందనం అమలు చేస్తామని, రైతులకు అన్నదాత సుఖీభవ పంపిణీ చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వెటర్నరీ జేడీ ఆర్.మురళీధర్, టెక్కలి వెటర్నరీ డీడీ వి.జయరాజ్, కోటబొమ్మాళి వెటర్నరీ ఏడీ మంద లోకనాథం, జిల్లా జనాభా లెక్కల నోడల్ అధికారి జి.నారాయణరావు పాల్గొన్నారు.



పెద్దబమ్మిడి గ్రామంలో పశు గణనను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కాలువలో రసాయనం.. పంట నాశనం

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరు గ్రామంలోని రైతులకు చేతికి అందివచ్చిన పంట నాశనమైంది. ఇక్కడ నారాయణసాగర్ నుంచి పంటపొలాలకు నీరే ప్రవహించే పిల్ల కాలువలో కెమికల్స్ వంటి ద్రవాన్ని ఎవరో డంపింగ్ చేశారు. దీంతో సాగునీరు అందిన స్థాయి మేరకు సుమారు 13 నుంచి 15 ఎకరాల వరిపంట మొత్తం నల్లగా మాడిపోయింది. ఈ కెమికల్స్ వంటి ద్రవాన్ని ఎవరు తెచ్చారు. ఎక్కడి నుంచి తెచ్చి కలిపారో తెలియక రైతులు అల్లాడుతున్నారు. నష్టపోయిన రైతులు బొల్లి రాంబాబు, గొర్లె సూర్యనారాయణ, రాజారావు, రాయవలస అప్పారావు, రాజారావు, సూర్యనారాయణ, కోటీశ్వరరావు, సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ అహర్నిశలు కష్టపడి పండించిన పంట చేతికందిన సమయంలో నాశనం చేశారని దీనిపై లావేరు పోలీసులకు ఫిర్యాదుచేశామని తెలిపారు.



పాడైన వరి పంట (ఇన్‌సెట్లో) కాలువలో ప్రవహిస్తున్న కెమికల్స్ వల్ల పంట పొలాల్లో చనిపోయిన చేపలు

నేడు డీఎల్‌టీసీలో స్నాతకోత్సవం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణ కేంద్రంలో శనివారం స్నాతకోత్సవం జరగనుంది. 2023–24 విద్యా సంవత్సరానికిగాను వివిధ కోర్సులు/ట్రేడుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రధానం చేయనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్‌మోహన్‌రావు తెలిపారు. విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు డీఎల్‌టీసీ శిక్షణ కేంద్రం వద్దకు చేరుకోవాలని ఆయన సూచించారు.

నవంబర్ 4 నుంచి స్పెషల్ డ్రైవ్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం 2011 నుంచి 15 ఇయర్ ఎండ్ బ్యాచ్ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నవంబర్ 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఎగ్జామినేషన్స్ కార్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. డిగ్రీ ఇయర్ ఎండ్ రెండో ఏడాది పరీక్షలు నవంబర్ 4వ తేదీ నుంచి 18వ తేదీ వరకు, ఇయర్ ఎండ్ డిగ్రీ మూడో ఏడాది పరీక్షలు నవంబర్ 20 నుంచి డిసెంబర్ రెండో తేదీ వరకు నిర్వహించనున్నారు.

ఎవరి కోసం ఈ 'ఎగ్'స్ట్రా పనులు



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 03వ వార్డు పద్మనాభపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని పరిస్థితి ఇది. సుమారు నలభై మందికి పైగా విద్యార్థులు ఉన్న ఈ బడిలో ఇద్దరు టీచర్లు ఉన్నారు. పాఠశాల మధ్యాహ్న భోజన పథకానికి వచ్చే కోడిగుడ్ల వ్యాను పాతజాతీయ రహదారిలో నిలిపివేయడంతో విద్యార్థులతోనే ఆ గుడ్లు మోయించారు. వ్యాను సిబ్బంది, స్కూలు ఆయాలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఉన్నా పిల్లలే మోయాల్సి వచ్చింది.

– కాశీబుగ్గ

క్లుప్తంగా

వేధింపుల కేసులో జైలు శిక్ష

నరసన్నపేట: స్థానిక గాంధీనగర్-1లో నివాస ముంటున్న బొనెల సాంబశివరావుకు వేధింపుల కేసులో రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ హరిప్రియ శుక్రవారం తీర్పునిచ్చారని నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. తనను భర్త వేధింపులకు గురి చేస్తున్నాడంటూ భార్య బొనెల నాగలక్ష్మి 2022 డిసెంబర్ 5న నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ సింహాచలం, ఏఎస్ఐ కాంతారావులు దర్యాప్తు చేశారు. విచారణ అనంతరం జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు. ఏపీపీగా శాంతి సంతోషి వ్యవహరించారు.

స్కూల్‌గేమ్స్ ఉషూ క్రీడాకారుల ఎంపిక రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఉషూ ఎంపిక పోటీలు ఈ నెల 27న నిర్వహిస్తున్నట్టు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, కార్యదర్శి బి.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 9 గంటలకు అండర్-17, అండర్-19 బాలబాలికల ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు. ఇక్కడ ఎంపికైన వారు వచ్చేనెల 3, 4 తేదీల్లో శ్రీకాకుళం వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు.

జాబ్‌మేళాలో 48 మంది ఎంపిక



మాట్లాడుతున్న ఉపాధి అధికారి కె.సుధ

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని డీఎల్‌టీసీ శిక్షణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 48 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాకు 106 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వివిధ మౌఖిక పరీక్షల అనంతరం 48 మందిని ఎంపికచేసి, నియామక పత్రాలు అందజేసినట్టు డీఎల్‌టీసీ ఏడీ వై.రామ్మోహన్‌రావు తెలిపారు. అంతకు ముందు జరిగిన ఈ జాబ్‌మేళాను జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ప్రారంభించారు. నిరుద్యోగులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి యు.సాయికుమార్, ఆయా సంస్థల ప్రతినిధులు, ప్లేస్‌మెంట్ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకే ఎస్సీ వర్గీకరణ



మాట్లాడుతున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దళితులకు రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను తెరపైకి తీసుకొచ్చాయని ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు కళ్లేపల్లి రామ్‌గోపాల్, కంఠ వేణు, తైక్వాండో శ్రీను అన్నారు. మాలలంతా ఐక్యంగా కుట్రలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని నగరంలో ఓ ప్రవేటు భవనంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఎస్సీ రిజర్వేషన్ల పరిరక్షణ, క్రిమిలేయర్‌కి వ్యతిరేకంగా ఈ నెల 27న పలాసలో అవగాహన సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. పలాస డివిజన్‌కి చెందిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ వద్ద నిర్వహించే ఈ సదస్సుకు మాజీ ఎంపీ హర్షకుమార్, హైదరాబాద్‌కి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.ఎస్.ఎన్.మూర్తి, విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ జాన్‌లు హాజరవుతారని తెలిపారు.



మూగవేదన..!

ఆగని అక్రమ రవాణా



ఒకే వాహనంలో ఎనిమిది గేదెలను రవాణా చేస్తూ..

- ఆంధ్రా-ఒడిశా సరిహద్దు నుంచి కబేళాకు తరలిపోతున్న మూగజీవులు
- కంటైనర్లు, వ్యాన్‌లలో ఇష్టారాజ్యంగా తరలింపు
- కంటితుడుపు చర్యలకు పరిమితమవుతున్న యంత్రాంగం

కంచిలి :

మూగజీవాల అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. జిల్లాలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి కబేళాలకు పశువుల తరలింపు నిరాటంకంగా సాగుతోంది. ముఖ్యంగా ఉద్దానం ప్రాంత మండలాలైన ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల నుంచి పెద్ద ఎత్తున అక్రమ రవాణా జరుగుతోంది. ఈ వ్యవహారంపై ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతూ, దౌర్జన్యాలకు దిగుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన కొందరు కబేలా వ్యాపారులు స్థానికులతో కలిసి ఈ దందా చేస్తున్నట్లు సమాచారం.

అన్ని వాహనాల్లోనూ..

ముఖ్యంగా సరిహద్దు ఒడిశా ప్రాంతం నుంచి ఎక్కువగా మూగజీవాలను జాతీయ రహదారి సమీపంలో నిర్మాణుష్యంగా ఉన్న స్థలాలకు వివిధ రోడ్డు మార్గాల్లో తరలిస్తున్నారు. అక్కడి నుంచి టాటా ఏస్, మహీంద్రా మ్యాక్స్‌పిక్, ఐషర్, పూర్తిగా క్లోజ్ చేసిన వాహనాలు, మోటారు సైకిల్స్ రవాణా చేసే భారీ కంటైనర్లలో కబేలాలకు తరలిస్తున్నారు. రవాణా చేసే ప్రక్రియలో ఒకే వాహనంలో ఎక్కువ మొత్తంలో పరిధికి మించి పశువుల్ని ఎక్కించడం, వాటికి మార్గమధ్యలో ఎటువంటి ఆహారం గాని, నీళ్లు పెట్టకపోవడంతో కొన్ని జీవాలు దించేలోపే మృత్యువాతపడుతున్నాయి. అలాంటివాటిని రోడ్ల పక్కనే విడిచిపెట్టి వెళ్లిపోతున్నారు. వీటిని అరికట్టాల్సిన అధికార యంతాగం ఎప్పుడో ఒకసారి కంటితుడుపు చర్యగా ఒక లోడ్‌ను పట్టుకొని తమ పనైపోయిందనే రీతిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు వ్యక్తులు ఈ దందాను అడ్డం పెట్టుకొని ఇక్కడ జరుగుతున్న లావాదేవీలకు సంబంధించి ఒక్కో జీవికి కొంత చొప్పున కమీషన్ తీసుకొంటూ ఈ వ్యవహారం సజావుగా సాగేందుకు సాయపడుతున్నారనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ఈ విషయమై కొందరు జిల్లా ఎస్పీకి పదే పదే ఫిర్యాదు చేయడంతో కంచిలి మండలంలోని పాతాళేశ్వర ఆలయం వెనుక కొన్నాళ్లుగా సాగిన పశువుల కొనుగోలు, రవాణా తంతు పోలీసుల దాడులతో ఆగింది. అయితే జమేదారుపుట్టుగ కేంద్రంగా గేదెలు, పోతుల రవాణా మాత్రం నిరాటంకంగా సాగుతోంది. ఇటీవల పోలీసులు గేదెల రవాణాకు సంబంధించి వచ్చిన సమాచారం మేరకు వాటిని కాపుకాసి కంచిలిలో ఒక ఐషర్ వ్యాన్‌లో 32 గేదెలను, మూడు మహీంద్రా పికప్ వాహనాల్లో 23 పశువుల్ని పట్టుకొని కేసులు నమోదు చేశారు.

అడ్డుకుంటున్నాం..

ఈ ప్రాంతంలో జరిగే పశువుల రవాణా వ్యవహారంపై గట్టి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కంచిలి మండల పరిధిలో జరిగే దందాను అరికట్టాం. ఇక చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కంచిలి జాతీయ రహదారి మీదుగా జరుగుతున్న అక్రమ రవాణాను అడ్డుకొని కేసులు నమోదు చేస్తున్నాం.

– జి.రాజేష్, కంచిలి ఎస్ఐ

ఎక్కడికక్కడ కొనుగోలు..

ఇచ్ఛాపురంలో ఓ వ్యక్తి, కవిటి మండలం జమేదారుపుట్టుగ గ్రామ సమీపంలో ఉంటున్న కేరళకు చెందిన వ్యాపారి, కంచిలికి చెందిన మరి కొందరు కలిసి ఉద్దానం మండలాల్లో మూగజీవాలు కొనుగోలు నుంచి వాహనాల ఏర్పాటు, రవాణా చేసే వ్యవహారాలు చూస్తున్నట్లు సమాచారం. గతంలో శని, ఆదివారాల్లోనే ఈ లావాదేవీలు జరిగేవి. ప్రస్తుతం అన్ని రోజుల్లో రాత్రీ, పగలు అనే తేడా లేకుండా యథేచ్ఛగా ఈ అక్రమ రవాణా సాగుతోంది. నిర్దేశిత స్థలం అని కాకుండా ఎక్కడికక్కడ గ్రామాల్లో ఆవులు, ఎడ్లు, పోతులు, దున్నలను కొనుగోలు చేసి అక్రమార్కులు వాహనాల్లో కుక్కేసి తరలిస్తున్నారు. స్థానికంగా పశువుల సంత పెద్దగా కూడకపోవటంతో నారాయణవలస, తిలారు సంతలకు ఇక్కడి పశువుల్ని ప్రతీరోజు తరలిస్తున్నారు.



ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న గేదెల రవాణా కంటైనర్

డాబా పైనుంచి పడి యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న ప్రశాంత్

సోంపేట: మండలంలోని మామిడిపల్లికి చెందిన తెలుకుల ప్రశాంత్ శుక్రవారం ఇంటి డాబా ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. తలకు తీవ్రగా యం కావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్‌లో నరం కట్ అయినట్లు వైద్యులు తెలిపారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో చికిత్సకు దాతలు ముందుకు రావాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల: బుడుమూరులోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జార్ఖండ్‌కు చెందిన సంతోష్‌కుమార్ (33)కు గాయాలయ్యాయి. ఇక్కడి ఫ్లై ఓవర్ వద్ద జరుగుతున్న రోడ్డు పనులను ఓ ప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సంతోష్‌కుమార్ పరిశీలిస్తుండగా శ్రీకాకుళం నుంచి రణస్థలం వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. బ్రిడ్జి పైనుంచి కిందకు పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. లావేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లై ఓవర్ వద్దు.. బైపాస్ ముద్దు



నినాదాలు చేస్తున్న రణస్థలం ఫ్లై ఓవర్ వ్యతిరేక కమిటీ సభ్యులు

రణస్థలం: రణస్థలం అభివృద్ధికి అవరోధంగా నిలిచే ఫ్లై ఓవర్ నిర్మాణం ఎట్టి పరిస్థితుల్లోనూ చేపట్టవద్దని, ప్రజలకు ఆమోదయోగ్యమైన బైపాస్ నిర్మాణమే చేపట్టాలని రణస్థలం ఫ్లై ఓవర్ వ్యతిరేక కమిటీ సభ్యులు నినదించారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ మాట్లాడుతూ రణస్థలం మండలం ఇప్పుడిప్పుడే ప్రగతి పథంలో నడుస్తున్న సమయంలో అభివృద్ధి నిరోధకంగా నిలిచే ఫ్లై ఓవర్ నిర్మాణం వద్దని చెప్పారు. గతంలో రైతులకు భూ పరిహారంగా సుమారు రూ.90కోట్లు, నిర్మాణానికి రూ.70 కోట్లు కలిపి రూ.160 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు రైతుల నష్టపరిహారం 30 శాతం తగ్గించమని హైవే అధికారులు కోరారని, నిర్వహణ ఖర్చు అధికమవుతుందని అంచనా వేశారని, ఇప్పుడు రూ. 252.42 కోట్లు నిధులు ఖర్చు చేయడానికి ఎలా ముందుకు వచ్చారని ప్రశ్నించారు. బైపాస్ వస్తే రణస్థలం భారీగా విస్తరించి అభివృద్ధి పథంలో నడుస్తుందని, మండల కేంద్రంలోని వ్యాపారులకు ఎటువంటి నష్టం వాటిల్లదని చెప్పారు. ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ రణస్థలం మండల కేంద్రం (జే.ఆర్.పురం) ఫ్లై ఓవర్ వస్తే వ్యాపారాలు పూర్తిగా దెబ్బతింటాయని, వేలాది కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రణస్థలం వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, కమిటీ సభ్యులు ఇ.తిరుపతిరాజు, గాజుల భాస్కరరావు, చుక్క శ్రీను, జగిలింకి రమేష్, బాలాజీ జగదీష్, టీకి బ్రహ్మాజీ, గుప్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్యా.. బయటపడ్డాం



గొయ్యిలో ఒరిగిన బస్సుపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఇచ్ఛాపురం రూరల్ : ఇచ్ఛాపురం నుంచి ఒడిశా రాష్ట్రానికి వెళ్తున్న ఒడిశా బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం సాయంత్రం లొద్దపుట్టి జంక్షన్ నుంచి ఒడిశా జరడాకు ప్రయాణికులతో బయల్దేరిన ప్రైవేటు బస్సు జగన్నాథపురం మలుపులోకి వచ్చే సరికి పట్టుతప్పి రోడ్డు గొయ్యిలోకి ఒరిగిపోయింది. బస్సుపైనే 11 కేవీ విద్యుత్ తీగలు ఉండటంతో ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బయటకు పరుగులు తీశారు. ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రెండు ఇసుక లారీలు సీజ్



కొత్తవలస సమీపంలో సీజ్ చేసిన లారీలు

ఆమదాలవలస: నాగావళి, వంశధార నదులనుంచి ఇసుకను అక్రమంగా లారీలతో తరలిస్తే చర్యలు తప్పవని ఆమదాలవలస తహశీల్దార్ రాంబాబు హెచ్చరించారు. ఆమదాలవలస మండలం నాగావళి నది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను శుక్రవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తవలస, దూసి గ్రామాల మధ్య ఇసుకతో వెళ్తుండగా లారీలను పట్టుకొని ఆమదాలవలస పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ట్రాక్టర్లు, నాటుబళ్లతో భవన నిర్మాణాలకు మాత్రమే ఇసుకను తీసుకెళ్లాలని, లారీలతో తీసుకెళ్లి నిల్వ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

1059 అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి



పనులను పరిశీలిస్తున్న పీడీ శాంతిశ్రీ

నరసన్నపేట: జిల్లాలో పక్కా భవనాలు ఉన్న 1059 అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.2.81 కోట్లు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ తెలిపారు. 533 కేంద్రాలకు మరుగుదొడ్లు, 526 కేంద్రాలకు నీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. నరసన్నపేట ప్రాజెక్టు పరిధిలోని బండివీధి, పెద్దపేట కేంద్రాల వద్ద జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు నాణ్యతగా ఉండాలన్నారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు, నీటి సదుపాయానికి రూ.17 వేలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బండివీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో నరసన్నపేట పీఓ నాగమణి, సూపర్‌వైజర్ రమణమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు హర్ష



హర్షను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీలు

గార: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు గార మండలం కొర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రగడ హర్ష ఎంపికయ్యాడని హెచ్‌ఎం వై.వాసుదేవరావు, పీడీ ఎస్.వి.రమణమూర్తి శుక్రవారం తెలిపారు. ఈ పోటీలు పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. హర్ష ఇటీవల జరిగిన జిల్లా స్కూల్ గేమ్స్‌లో రాణించడంతో రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా హర్షను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

చేపల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి

ఆమదాలవలస : చేపల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమదాలవలసలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి(హైదరాబాద్), కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా స్వదేశీ మత్స్యకార సహకార సంఘ సభ్యులకు వృత్తి విద్యా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపల పెంపకంపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ సహజ మంచినీటి వనరులలో చేపల దిగుబడికి నేల, నీటి గుణాల యాజమాన్యం కీలకమన్నారు. చేప పిల్లల పెంపకంలో నూతన పద్ధతులను అవలంబించి ఆదాయమార్గాలను ఏర్పరచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్వదేశీ మత్స్యకార సహకార సంఘ సభ్యులు, మత్స్య సహాయకుడు భాస్కర్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు జి.ఎస్.రాయ్, సునీత, హరికుమార్, కిరణ్ అనూషా పాల్గొన్నారు.

పన్ను ఎగవేతదారులకు రూ.12.06 లక్షల జరిమానా



స్క్రాప్‌తో పట్టుబడిన లారీ ఇదే..

శ్రీకాకుళం క్రైమ్ : పన్ను ఎగవేతదారులపై నిరంతర నిఘా పెడుతున్నామని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని శ్రీకాకుళం విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బి.ప్రసాదరావు హెచ్చరించారు. శుక్రవారం రాత్రి జీఎస్టీ ఎగవేస్తూ ఇనుప తుక్కును కొంతమంది వ్యాపారులు లారీల్లో తరలిస్తుండటంతో విజిలెన్సు అధికారులు దాడులు నిర్వహించినట్లు చెప్పారు. రాజాం, పూసపాటిరేగ, సాలూరు, శ్రీకాకుళానికి చెందిన వ్యాపారులు వేరే వ్యక్తుల పేరిట బిల్లులు సృష్టించి సరుకును గుంటూరులో ఉన్న కొన్ని డొల్ల కంపెనీల సహాయంతో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ క్రమంలో రాజాం వద్ద రెండు లారీలు, శ్రీకాకుళం, సాలూరు, పూసపాటిరేగల వద్ద ఒక్కో లారీ చొప్పున పట్టుకున్నామని చెప్పారు. సంబంధింత పన్ను ఎగవేతదారుల నుంచి రూ.12,06,980 జరిమానాను జీఎస్టీ అధికారుల ద్వారా వసూలు చేసినట్లు తెలిపారు. మరింత లోతుగా విచారణ జరపడంతో అనుమానాస్పద వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నది గుంటూరులోని మురళీ ట్రేడర్స్ యాజమాన్యంగా గుర్తించామని, వెంటనే వారి జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశామని చెప్పారు. వ్యాపారులు చట్టప్రకారం పన్నులు చెల్లించాలని ఆయన సూచించారు.

పే రివిజన్ అమలు చేయాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు 15 శాతం ఫిట్‌మెంట్‌తో 2017 జనవరి 1 నుంచి పే రివిజన్, డీవోటీ పింఛన్‌దారులకు పెన్షన్ రివిజన్ అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఆలిండియా బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్, పెన్షనర్స్ అసోసియేషన్, కాంట్రాక్ట్ వర్కర్స్ నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం శ్రీకాకుళంలోని సంచార భవన్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఈయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావులు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ సంస్థలో 4జీ, 5జీ సేవలు వేగవంతం చేసి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.అభిమన్యు, కె.గోపాలరావు, హెచ్.ఢిల్లేశ్వరరావు, కె.ప్రసాద్, ఎం.వెంకటరావు, వి.శ్రీనివాసరావు, పి.శారద, భానుచందర్, ఎన్.కసవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాడాంలో బాణసంచా సీజ్



స్వాధీనం చేసుకున్న బాణసంచా వద్ద పోలీసులు

నరసన్నపేట: మండలంలోని బాడాం గ్రామంలో అనుమతి లేకుండా నిల్వ చేసిన బాణసంచాను నరసన్నపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం రాత్రి నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు శివ్వాం సత్యనారాయణ ఇంట్లో సోదాలు నిర్వహించారు. అక్రమంగా నిల్వ చేసిన సుమారు రూ.2లక్షల విలువైన బాణసంచా గుర్తించి సీజ్ చేశారు. ఈ దాడుల్లో వీఆర్వోలు పద్మావతి, ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండలం లింగాలవలస మామిడి తోటలో అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తున్న గేదెల రమణ, లింగాలవలస గ్రామానికి చెందిన దాసరి గురినాయుడు, గౌరిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.14,320 విలువైన మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నామని లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కడలిపై కదిలిన బతుకు‘నావ’

ఎట్టకేలకు కడలిపై మత్స్యకారుల బతుకు నావ కదిలింది. పౌర్ణమి ఆటుపోట్లు, ‘దానా’ తుఫాన్ హెచ్చరికలతో వారం రోజులుగా మత్స్యకారులు చేపల వేటకు దూరమై ఇంటి పట్టునే ఉండిపోయారు. తుఫాన్ ముప్పు తప్పడంతో పాటు సముద్రం ప్రశాంతంగా ఉండటంతో శుక్రవారం మత్స్యకారులు చేపల వేట కొనసాగించారు. ఈ సందర్భంగా డొంకూరు సముద్ర తీరంలో ‘వాలలు, సవ్వాళ్లు, కార’ చేపలు పడటంతో వ్యాపారులు అధిక మొత్తంలో కొనుగోలు చేయడంతో మత్స్యకారులు ఆనందం వెల్లివిరిసింది.

– ఇచ్ఛాపురం రూరల్



వలల నుంచి చేపలను వేరు చేస్తున్న మత్స్యకారులు



చేపలను వంతులు చేస్తున్న మత్స్యకార మహిళలు



మత్స్య సంపదతో ఒడ్డుకు చేరుతున్న పడవ